విశాలాంధ్ర కృష్ణా జిల్లా

వైసీపీ నుంచే పోటీ చేస్తా

ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్

విశాలాంధ్ర-గన్నవరం : వైసీపీ అభ్యర్థిగా గన్నవరం నుంచి పోటీచేసి గెలుస్తానని గన్నవరం ఎమ్మెల్యే డా వల్లభనేని వంశీమోహన్ అన్నారు. శనివారం గన్నవరం పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ దుట్టా రామచంద్రరావు మొదట కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, గన్నవరంలో మొదట మెచినేనిబాబు వైసీపీ జెండా ఎగురవేశారని తెలిపారు. దుట్టా రామచంద్రరరావు ఎన్నికల ముందు వైసీపీలో చేరారని, ఎన్నికలలో ఓడిపోయారని అన్నారు. యార్లగడ్డ వెంకట్రావు ఓడిపోయిన నాటినుండి విజయవాడ వెళ్లి పోయారని తెలిపారు. నేను 2006 నుండి రాజకీయాలలో ఉన్నానని తెలిపారు. దుట్టా రామచంద్రరావు కుమార్తెకు ఉంగుటూరు జడ్పీటీసీ సభ్యులుగా ఏకగ్రీవం చేశానని, అయినా రామచంద్రరావు నామీద విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. వారికి చంద్రబాబు పెద్ద సైకో, పిల్ల సైకో లోకేష్ అన్నారు. తెలుగుదేశం పట్టాభి నామీద సంకల్ప సిద్ధి అవకతవకలు జరిగితే నాకు వాటా ఉందని చెప్పటం బెంగుళూరు వెళ్లిన టికెట్లు ఉన్నాయని చేపట్టంపై కోర్టులకు వెళ్లానని తెలిపారు. మార్చి 3వ తేదీన విచారణ జరుగుతుందని అన్నారు. ఉరకుక్కలు ఎన్ని మోరిగినా నన్ను పీకలేరని వంశీ అన్నారు.

జనసేన రాష్ట పర్యటనలో పత్తిపాటి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జనసేన పార్టీ విధి విధానాలను రాష్ట్రవ్యాప్తంగా తెలియజేస్తూ పర్యటన ప్రారంభించిన ప్రత్తిపాటి బాల బాలాజీని శనివారం మచిలీపట్నంలో జనసేన పార్టీ నాయకులు అభినందించారు. రాబోయే ఎన్నికలలో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలి అంటూ, ప్రజా సమస్యల పట్ల అర్జీలు తీసుకుంటూ సంబంధిత అధికారులకు పంపుతూ జనసేన పార్టీ గుర్తును ధరించి విస్తత ప్రచారం చేయిస్తున్న బాల బాలాజీ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ నాయకులు బండి రామకృష్ణ, లంకిశెట్టి బాలాజీ అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవినీతి రహిత సమాజం కోసం, స్వచ్ఛమైన పాలన కోసం పవన్ కళ్యాణ్ ను బలపర్చాలంటూ ప్రత్తిపాటి చేస్తున్న ప్రచారం పార్టీకి మరింత బలాన్ని చేకురుస్తుంది అన్నారు. ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ ప్రత్తిపాటి నీ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు, డివిజన్ ఇన్చార్జి గుణం వాసు, న్యాయవాది కమిలి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణరావు

విశాలాంధ్ర-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి. గోపాలకృష్ణారావు శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన న్యాయమూర్తికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకొనగా ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి ఆలయ సూపరిన్టెండెంట్ బొప్పన సత్యనారాయణ చిత్రపటాన్ని అందజేసి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకళ్యాని, మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ ప్రకాష్, తాసిల్దార్ కూరపాటి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మహాశివరాత్రి సందర్భంగా కూచిపూడి రోటరీ క్లబ్ మరియు జనతా గ్యారేజ్ ఫ్రెండ్ సర్కిల్.ల సంయుక్త ఆధ్వ ర్యంలో కూచిపూడిలోని బార్లపూడిరోడ్‌లో శనివారం బాటసారులకు, భక్తులకు చల్లని మజ్జిగ, పులిహెూర పంపిణీ చేశారు. కూచిపూడి నుంచి ఐలూరు బస్సులో వెళ్లే ప్రయాణికులకు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులకు ఆపి మరీ అందజేశారు. వారు 100 కిలోల పులిహెూర, 200 లీటర్లుకు పైగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బీహెచ్, వి. ఆర్.ఎస్ . సాయి, పాగోలు రమేష్ బాబులు, కోశాధికారి కోనేరు మంజునాథ్, సభ్యులు పామర్తి గోపి, చెరుకు గోపి, వీరాబత్తిన రవి, బోలెంశివ, సూరపనేని సుధాకర్, లతోపాటు జనతా గ్యారేజ్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో..ఖో పోటీలకు విద్యార్థిని హిందు

విశాలాంధ్ర-కూచిపూడి : విశాఖ పట్నంలో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి ఖో..ఖో పోటీలకుమొవ్వ మండ లంలోని చినముత్తేవి జిల్లా పరిషత్ హై స్కూల్ 8వ విద్యార్థి డి.హిందు పాల్గొంటున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.ఎస్. సాయికుమార్ శనివారం తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో ఈ పోటీలు జరుగుతున్నాయని ఆయన వివరించారు.

వైవీరావు మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

విశాలాంధ్ర-విజయవాడ : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వైవీ.రావు మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి, కృష్ణాజిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ టి.తాతయ్య అన్నారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు గుండెపోటుతో వై.వీ.రావు మరణించానే వార్త తెలిసిన వెంటనే తాతయ్య గొల్లపూడిలోని ఆయన నివాసం దగ్గర దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. విజయవాడ నగరంలో సిటీ బస్సులు జాతీయం చేయాలని అనేక పోరాటాలు నిర్వహించారని, ఆర్టీసీ ఉద్యోగస్తులు కార్మికులు ప్రభుత్వంలో విలీనం అవటానికి రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తూ విలీనం అయ్యే వరకు పోరాటాలు నిర్వహించారని చెప్పారు. వైవీరావు మృతి ఆర్టీసీ ఉద్యోగస్తులకు, కార్మికులకు, భారత కమ్యూనిస్టు పార్టీకి, ఏఐటీయూసీకి తీరని లోటు అన్నారు.

కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని గురువిందగుంట గ్రామంలో గుడివాడ రోటరీ క్లబ్ సహకారంతో, ఉయ్యూరు రోటరీ కంటి ఆసుపత్రి వారిచే ఈనెల 22వ తేదీ బుధవారం 9 గంటల నుండి ఒంటిగంట వరకు అంబేద్కర్ బొమ్మ సెంటర్లో కంటి నీటి కాసులు, కంటి శుక్లాలు, కంటి మసక పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఆపరేషన్లు, కళ్ళజోళ్ళు, శుక్లాల మందులు ఉచితంగానే పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మండలంలోని కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవలసినదిగా రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎం. రమణమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ వై. రెడ్డయ్య చౌదరి, సెక్రటరీ గుండు నరేష్ శనివారం తెలిపారు.

మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎస్ఐ

విశాలాంధ్ర-కూచిపూడి : మానవత స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో శనివారం శివరాత్రి సందర్భంగా కూచిపూడి సెంటర్లో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కూచిపూడి ఏఎస్ఐ ఎస్ కే జిలాని ప్రారంభించారు. సందర్భంగా ఆ సంస్థ స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న పలు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు పిట్టు శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు బోరుకాటి సత్యనారాయణ రాజు, డాక్టర్ పాలన అశోక్, మండల ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి తాళ్లూరు మోహన్ కుమార్లతో పలువురు పాల్గొన్నారు.

వెంకట్రావు కుటుంబానికి మట్టిఖర్చులకు రూ. 10 వేలు

విశాలాంధ్ర-ఎ కొండూరు : ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం లోని చీమలపాడు పీఏసీఎస్ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ సంఘ సభ్యుడు గంజి శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి శనివారం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు మృతుని కుటుంబానికి కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10 వేలు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులు నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ మేనేజర్ పి .సత్యనారాయణ, సూపర్వైజర్ ఎన్ వి సుబ్బారావు, వి కుటుంబరావు సర్పంచ్ ముచ్చు సీతయ్య వైస్ ఎంపీపీ శివారెడ్డి సంఘ సభ్యులు డైరెక్టర్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విశాలాంధ్ర- కంచికచర్ల: కీసరలో శనివారం దేవాలయ మండపం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన వ్యక్తి వివరాలు ఆరా తీశారు. మృతి చెందిన వ్యక్తి యాచకుడని పది రోజుల నుండి పరిసర ప్రాంతాలలో తిరుగుతూ ఉన్నాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పంచాయతీ సిబ్బంది సాయంతో కార్యక్రమాలు నిర్వహించారు. అతని వయస్సు సుమారు 50 నుండి 55 సంవత్సరాలు కలిగి ఉన్నాడని, శరీరంపై తెల్లని గళ్ళు కలిగిన ముదురు నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడని, చనిపోయిన వ్యక్తి వివరాలు తెలిస్తే కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తాజాగా తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్స్ను ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా ఆధునీకరించబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందని పేర్కొంది. ఇది భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్స్, ఫ్లీట్ యజమానుల అవసరాలను తీర్చనుందని తెలిపింది. తమ డీలర్ లేదా అవుట్లెట్, ఆన్లైన్ రూ. 50వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా నాలుగు గ్రేడ్లలో ఐదు రంగులో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

వైవీ రావుకు ఘన నివాళి

వైవీరావు (ఫైల్)

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవీరావు(57) ఆకస్మిక మృతికి సీపీఐ విజయవాడ నగర సమితి ఘన నివాళులు అర్పించింది. గొల్లపూడిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందిన మరణవార్త తెలిసిన వెంటనే సీపీఐ

విజయవాడ నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు తదితర నాయకులు శనివారం వైవీరావు మృతదేహాన్ని సందర్శించి, మృతదేహంపై పార్టీ జెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయనతో పాటు నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య, తూనం వీరయ్య, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ఎస్‌కే.నజీర్, 18వ డివిజన్ సహాయ కార్యదర్శి కూరాకుల స్టాలిన్, 18వ డివిజన్ సీనియర్ నాయకులు గుంజా గోపాలం, ఉస్తేల రాహేల్‌బాబు పాల్గొని వైవీ రావు మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైవీ.రావు కార్మిక రంగానికి చేసిన విశిష్టమైన సేవలపై ఎస్‌కే.నజీర్ విప్లవ గేయాన్ని ఆలపించారు.

ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వ పాలన

విశాలాంధ్ర-మోపిదేవి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడానికి నిరసనగా శనివారం మోపిదేవి ప్రజాశక్తి నగర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా పాలన నడుస్తుందని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే సూచనలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులను ప్రతిపక్షాల గొంతులను అణిచివేసే అధికార పార్టీ నిరంకుశ వైఖరిని ఖండించారు. కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మోపిదేవి మండల పార్టీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధవరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, రాష్ట్ర సెల్ ఉపాధ్యక్షులు పోలిమెట్ల ఏసుబాబు, కొక్కిలి గడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాం బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కత్తి చూపించి... ఫోన్ దోపిడీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కత్తి చూపించి సెల్‌ఫోన్ దోపిడీ చేసిన ఘటన ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన రాజేందర్ అతని స్నేహితుడితో తమ ద్విచక్రవాహనం ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న సమయంలో గుంటుపల్లి వద్ద గుర్తుతెలియని ముగ్గురు యువకులు రాజేందర్‌ను కత్తి చూపించి ఐఫోన్ లాక్కోని పరారయ్యారు. బాధితుడు ఇబ్రహీపట్నం పోలీసులకు ఆశ్రయించాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భవానీపురంకు చెందిన వెంకటేశ్వరెడ్డి(40) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్న సమసయంలో తుమ్మలపాలెం సమీపంలో వెనుక నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో హిట్లర్ పాలన

విశాలాంధ్ర-ఎ కొండూరు : రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగుతుందని, అనపర్తిలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభను అడ్డుకోవడం వైసీపీ ప్రభుత్వ పిరికి పంద చర్యఅని తిరువూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి శవాల దేవదత్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు గ్రామంలో మెయిన్‌రోడ్డులో ఉన్న బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవదత్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా గత మూడున్నర ఏళ్ళు నుండి అడుగు అడుగునా రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందనీ వైసీపీప్రభుత్వం ప్రజలకు కల్పించిన రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, సామాన్య ప్రజల నుండి, ప్రతిపక్ష పార్టీలు నేతల వరకు వైసిపి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందని అన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవో 1ని తీసుకువచ్చి వైసిపి ప్రభుత్వం నియంత పోకడలకు పోతుందని రాజ్యాంగం ప్రతీ పౌరుడికి భావ ప్రకటన స్వేచ్ఛ ను ఇచ్చిందని కానీ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజల నోరు తెరిచి తమ అభిప్రాయాన్ని చెప్పలేని స్థితికి ఈ ప్రభుత్వం తీసుకువచ్చింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎ. రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వి మునియ్య, వి.దేవిడ్‌రాజు, బీ.భీమానాయక్, ఎమ్. ఏలీయాబాబు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలకు సబ్సిడీ ఏదీ?

ఇబ్బంది పడుతున్న రైతులు పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-ఎ కొండూరు : ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడంతోనే అధిక దిగుబడి సాధించగలమని ప్రభుత్వం చెప్తుంది. యంత్రాలను వినియోగించడం ద్వారా కూలీల సమస్య అధిగమించాలని అంటుంది. అయితే గత మూడున్నర సంవత్సరాలుగా వ్యవసాయ పరికరాలను ఇచ్చే రాయితీని మాత్రం ఈ ప్రభుత్వం మగళం పాడిందని ఏ కొండూరు మండలనికి చెందిన సన్న చిన్నకారు రైతులు అంటున్నారు. ఈ మండలంలోని సుమారుగా 10 వేల మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారంటే అతి శయోక్తి కాదు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 2018 వరకు రాయితీపై వరి కోత మిషన్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, వరిగడ్డి చుట్టే యంత్రాలు, టార్పాలిన్లు, రైతులకు బోరన్, జింకు వంటి పదార్థాలను రైతులకు సబ్సిడీ ద్వారా అందించే వారిని 2019వ సంవత్సరం నుండి వ్యవసాయ యంత్ర పరికరాలపై ప్రభుత్వం అయితే రాయితీలను ఇవ్వడం లేదని రైతులు ఒక ఇంత ఆ సహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతులు చివరికి చేసేది లేక యంత్ర పరికరాలపై బహిరంగ మార్కెట్లో పూర్తి డబ్బులు చెల్లించి పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వంలో అయితే 50% రాయితీతో యంత్ర పరికరాలను వ్యవసాయశాఖ ద్వారా అందించే వారిని కానీ ఇప్పుడు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించి యంత్ర పరికరాలను కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. రైతే రారాజు అంటున్న ప్రభుత్వాలు మాత్రం రైతు నడ్డివిరిచే పనులు చేస్తున్నాయని పలువురు రైతులు ప్రభుత్వం మీద అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఆర్‌బీకే కేంద్రాల అనుసంధానంతో యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి అద్దె ప్రాతిపదికన వ్యవసాయ పరికరాలను అందిస్తుంది. కానీ అవి సరిగా అందుబాటులో ఉండడం లేదని, గతంలో మాదిరిగానే ప్రతి రైతుకు యంత్ర పరికరాలకు సబ్సిడీని అందజేస్తే బావుంటుందని మండలానికి చెందిన పలువు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికుల నుండి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు విశేష స్పందన లభిస్తోంది ముఖ్యంగా విజయవాడ డివిజన్‌లోని ప్రాంతాల ప్రజల మనస్సును చోరగుం టుందని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. భారతీయ రైల్వే యొక్క అత్యంత ప్రతిష్టాత్మక రైలును జనవరి 15న సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ప్రవేశపెట్టారు. ఈ నెల వ్యవధిలో రైలు విని యోగదారుల నుండి భారీ ఎత్తున మంచి స్పందన లభించింది. ఈ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది. విజయవాడ వంటి ఆర్థిక ప్రాంతం నుండి ప్రజలు వివిధ ప్రయోజనాల కోసం వివిధ దిశలలో ప్రయాణిస్తారు. ఈ ప్రీమియర్ ఎక్స్‌ప్రెస్ రైలును పగటిపూట ప్రవేశపెట్టడంతో ఈ ప్రాంత ప్రజలకు మంచి ప్రయాణ అవకాశం. గత నెల వ్యవధిలో విజయవాడ నుంచి ఖమ్మం, వరంగల్, సికింద్రాబాద్‌లకు 8613 మంది ప్రయాణికులు రాగా, మరో 9,883 మంది రాజమండ్రి, విశాఖపట్నం వైపు ప్రయాణించారు. మరోవైపు విశాఖపట్నం వైపు నుంచి 9,742 మంది ప్రయాణికులు విజయవాడకు రాగా, మరో 10,970 మంది సికింద్రాబాద్‌వైపు నుంచి విజయవాడకు రాక పోకలు సాగించారు. విజయవాడ స్టేషన్‌నుండి ప్రతిరోజూ సగటున 638 మంది వ్యక్తులు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్నారు. అలాగే 714 మంది ప్రయాణికులు విజయవాడ స్టేషన్‌లో ప్రతిరోజూ రైలు దిగుతున్నారు. రైలు రెండు దిశలలో దాదాపు 140% సగటు ఆక్యుపెన్సీ(ప్రయాణికులు కూర్చునే సామర్థ్యం)తో నడుస్తోంది. అదనంగా కోచ్‌ల వెలుపల ప్లాట్‌ఫారమ్ వైపు కూడా కెమేరాలు ఏర్పాటు చేసారు. అన్ని కోచ్‌ల మధ్య రాకపోకలకు సులభంగా ఉండేందుకు మూసివేసిన గ్యాంగ్‌వేలతో ఏర్పాటు చేశారు. అన్ని ఎలక్ట్రికల్ క్యూబికల్స్,టాయిలెట్లలో మెరుగైన అగ్ని మాపక భద్రత ప్రమాణాలు. టచ్ ఫ్రీ సౌకర్యాలతో ఆధునిక బయో-వాక్యూమ్ టాయిలెట్లు. ప్రయాణీకుల సమాచారం, ఇన్ఫోటైన్ మెంట్‌ను వ్యాప్తి చేయడానికి ప్రతి కోచ్‌లో పెద్ద సైజు డిస్‌ప్లే యూనిట్‌లు, ప్రతి కోచ్‌లో నాలుగు అత్యవసర విండోలు అమర్చారు. ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ "కవచ్" యొక్క అధునాతన భద్రత అమర్చబడింది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయోజనాలు. ఆదివారం మినహా వారంలో ఆరు రోజులు పగటి వేళ నడుస్తుంది. ఇతర రవాణా మార్గాలతో ప్రయాణ సమయాన్ని పోల్చితే ఇది అతి తక్కువ ప్రయాణ సమయం.

మృతులకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయకుండా విమర్శలా ?

విశాలాంధ్ర-అవనిగడ్డ : రోడ్డు ప్రమాదంలో చనిపోయి 9 నెలలు దాటుతున్న నేటి వరకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తెలుగు దేశం పార్టీ నేతలపై విమర్శలు చేయడం సరికాదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు అన్నారు. శనివారం టి.డి.పి కార్యాలయంలో చిట్టిబాబు ఆద్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ పెడన నియోజకవర్గ ప్రయాణికులు అయ్యప్ప దర్శనానికి వెళ్ళి ఇటీవల తిరిగి వస్తున్న సమయంలో బాపట్ల జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురైన వారికి వెంటనే పెడన ఎం.ఎల్.ఎ మంత్రి జోగి రమేష్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని, కానీ నియోజకవర్గంలో ఘంటశాల మండలం చింతలమడ వాసులకు రోడ్డు ప్రమాదం జరిగి 5 గురు మరణించి 9 నెలలు గడుస్తున్న నియోజకవర్గ ఎం.ఎల్.ఎ ప్రయత్నాల దగ్గరే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరావు, ఉపసర్పంచ్ ఘంటశాల రాజమోహన్ రావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మద్దూరి కాంతారావు, విశ్వనాధుని మురళి, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, బండే రాఘవ, కోట సాయి లతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

మార్చి 2న మహాధర్నాకు తరలిరండి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : జగనన్న ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని టిడ్కో ఇళ్ళను సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఇచ్చిన పిలుపుమేరకు మార్చి 2వ తేదీన టిడ్కో జగనన్న ఇళ్ళ లబ్ధిదారులతో విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త మహా ధర్నాకు పేదలంతా వేలాదిగా తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో శనివారం సాయంత్రం జరిగిన సభలో సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, జగనన్న ఇంటికి ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చే రూ.1.80 లక్షలు పునాదులకే చాలడం లేదని, కనీసం రూ.5 లక్షలైనా ఇస్తే ఇంటిళ్లపాది శ్రమదానంతో కొంతమేరకు ఇంటిని పూర్తిచేసుకోగలుగుతారని అన్నారు. టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులు వడ్డీలకు అప్పు తెచ్చుకొని 30 వేల నుండి రూ.1.50 లక్షల వరకు సొంత ఇల్లు ఏర్పడుతుందని ఆశతో డబ్బులు చెల్లిస్తే వడ్డీలు పెరిగి అప్పిచ్చిన వారు ఒకపక్క వెంటపడుతుంటే, మరోపక్క బ్యాంకుల నుండి వస్తున్న నోటీసులతో లబ్ధిదారులు సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కోటేశ్వరరావు అన్నారు. ఈ పరిస్థితుల్లో సీపీఐ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులను కలసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఇళ్ళ నిర్మాణాలు ఏ స్థితిలో ఉన్నాయో వాస్తవ పరిస్థితులను గత రెండు మాసాలుగా పరిశీలించి లబ్ధిదారులతో అర్జీలను తయారు చేయించడం, దీక్షలు చేయడం, అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పించారని, చివరి దశగా మార్చి 2న రాష్ట్రవ్యాప్తంగా విజయవాడకు తరలివచ్చే వేలాదిమందితో మహాధర్నా జరుగుతుందని, ఎన్టీఆర్ జిల్లా నుండి లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు కార్యకర్తలు వెంకటేశ్వరరావు, రామయ్య, ముసలయ్య, నాసరయ్య, నాగేశ్వరరావు, మార్తమ్మ, గురవమ్మ, ఆదిమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన సీపీ క్రాంతిరాణా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పుణ్యస్నానాల ఘాట్ వద్ద ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని దుర్గా ఘాట్, పవిత్ర సంగమం ఘాట్, పున్నమి ఘాట్, భవానీఘాట్ తదితర ఘాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేవిధంగా చూడాలని బందోబస్తులో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేస్తూ దిశా నిర్దేశం చేశారు. సీపీతో పాటు అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ లక్ష్మీపతి, ఏసీపీ డాక్టర్ హనుమంతరావు, సీఐలు, ఉన్నారు.

నేడు ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఈనెల 19వతేదీన నిర్వహించే ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా పేర్కొన్నారు. పరీక్ష పూర్తి పారదర్శకంగా పటిష్ట బందోబస్తు నడుమ జరుగుతోందన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో 26 పరీక్షా కేంద్రాల్లో 12950 మంది అభ్యర్థులు పరీక్ష హాజరుకానున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా పటిష్ట బందోబస్తు, అవాంఛనీయ ఘటనలు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించే పరీక్షకు 9 గంటలకే అభ్యర్థులంతా పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతిలేదన్నారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్లు, ఇతర పరికరాలకు అనుమతి లేదని పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష హాలులోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్స్ తో పాటు, బ్లూ/బ్లాక్ పెన్, ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

మండల కేంద్రాన్ని మార్చాలనుకోవడం అన్యాయం

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని అన్ని శాఖలకు సమస్తం కల్పించామని, ప్రభుత్వ కార్యాలయాలకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉన్నాయని, మండల కేంద్రాన్ని వేరొక గ్రామానికి మార్చాలనుకోవటం అన్యాయమని, దీనికి వ్యతిరేకంగా సామరస్యంగా నిరసనలు రకాలుగా నిరసనలు తెలియజేస్తామని వీరులపాడు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు పట్టికొండ చంద్రమోహన్ అన్నాడు. మండల కేంద్రాన్ని వీరులపాడు గ్రామం నుండి జుజ్జూరుకి తరలింపువద్దని డిమాండ్ చేస్తూ వినూత్నంగా వీరులపాడు మండల కార్యాలయాల ఎదుట కార్యాలయ ఆవరణను చీపురుతో ఊడుస్తూ శనివారం తమ నిరసన తెలిపారు. 65వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామస్తులు వాసిరెడ్డి చిన్నబ్బాయి, గద్యాల కృష్ణారావు, షేక్ మహబూబ్ సుభాని, రెడ్డిబోయిన బాబురావు, సుంకర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అణగదొక్కే ప్రయత్నాలు తగవు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రభుత్వం చేసిన తప్పులను ప్రశ్నించేందుకు ముందుకొస్తే అణగదొక్కే ప్రయత్నాలు చేయటం ప్రభుత్వానికి తగదని తిరువూరు టీడీపీ ఇన్‌చార్జి శావల దేవదత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్సన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో శనివారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. అనపర్తిలో తమపార్టీ అధినేత చంద్రబాబు సభను అడ్డుకునేందుకు పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న సీఎం జగన్ త్వరలోనే ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. కొవ్వూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి, దళితవర్గానికి చెందిన కేఎస్.జవహర్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పోలీసులు వ్యవహరించాల్సి ఉన్నా, సీఎం ప్రత్యేకంగా నిబంధనావళి రూపొందించి, దీన్ని అమలు చేయమని ఆదేశాలివ్వటం, వీటినే పోలీసులు అవలంభించటం దారుణమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో విస్సన్నపేట పట్టణ అధ్యక్షుడు మర్రిబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు ఎ.వీరయ్యచౌదరి, కొట్టే చిరంజీవి, దాయక నారాయణ, తుమ్మలపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవాలు చదివే జిజ్ఞాసను పెంచుతాయి

విశాలాంధ్ర-విజయవాడ : పిల్లలు పుస్తకాలు చదవాలనే జిజ్ఞాసను పెంపొందించటానికి పుస్తక మహోత్సవాలు దోహదం చేస్తాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 33వ విజయవా పుస్తక మహోత్సవం గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తనకు ఈ బుక్ ఫెస్టివల్‌తో 2001లో అనుబంధం ఏర్పడిందన్నారు. తాను ట్రైనిగా వచ్చినపుడు కృష్ణాజిల్లా కలెక్టర్ గా బిఆర్ మీనా వున్నారని గుర్తు చేశారు. పుస్తక మహోత్సవాల ద్వారా దేశంలోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థల పుస్తకాలు ఎకే చోట లభిస్తాయని పాఠకులు ఎక్కువ శ్రమ లేకుండా వారికి నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ అధ్యక్షులు మనోహర్ నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

హేతువాది కావటంతో రావిపూడికి గుర్తింపు కరువు:

రావిపూడి వెంకట్రాది జీవితం అంతా చదవటం, పరిశీలించటం ద్వారా మార్క్సిజాన్ని కూడా విమర్శించే స్థాయికి ఎదిగి హేతువాదిగా మారిన కారణంగా ఆయనకు తగిన గుర్తింపు రాలేదని జస్టిస్ జి.రాధరాణి అన్నారు. పుస్తక మహోత్సవ వేదికపై నిర్వహించిన రావిపూడి వెంకటాద్రి సంస్మరణ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవ సాహితీ బుక్ హౌస్ అధినేత కె.రవి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అడ్వకేట్ సీఎల్ఎన్ గాంధీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లేవుగాని నూట ఒక్క పుస్తకాలు రాసి, ప్రచురించిన ఘనత రావిపూడికి ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా మేడూరి సత్యనారాయణ రచించిన 'జీవోత్పత్తి - జీవ పరిణామం - మానవ పరిణామం' పుస్తకాన్ని అమరావతి హేతువాద సంఘం అధ్యక్షులు రేజేటి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని పల్లవి పబ్లికేషన్ అధినేత ఎస్ వెంకటనారాయణ నిర్వహించారు.

డిజిటలైజేషన్‌తో భద్రత సులభం:

విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో 33వ పుస్తక మహోత్సవం గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదిక పై 'తెలుగు సాహిత్యం డిజిటీకరణ - గ్రంథాలయాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సభకు రహమనుద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న మనసు ఫౌండేషన్ ఎంవీ నాయుడు మాట్లాడుతూ కాగితంపై రాసిన, ముద్రించిన వాటిని ఒక తరం తర్వాత చూస్తే అవి పూర్తిగా చేదిరిపోయి ఉంటాయని అందుకనే వాటిని భద్రపరచడం కష్టతరంగా ఉండేదన్నారు. కంప్యూటర్స్ వచ్చిన తరువాత డిజిటల్ చేస్తే శాశ్వతంగా వుంటాయి. వీడియో, ఆడియోకు చాలా సులభంగా చేసి భద్రపర్చవచ్చన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందలపాటి శేషగిరరావు మాట్లాడుతూ నేడు టెక్నాలజీ ప్రాధాన్యత పెరిగిందని ప్రతి వ్యవస్థలోనూ టెక్నాలజిని ఉపయోగించుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందుకు వెళ్తున్నందుకు అభిందనలన్నారు. డాక్టరు గేయానంద్ మాట్లడుతూ మనం ఊహించనంతగా మరో ఇరవై ఐదు సంవత్సరాలలో పూర్తిగా మరబోతుందని పుస్తకాలు ఒక గుర్తుగా ఉండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 10 రోజులుగా నిర్వహిస్తున్న 33వ **విజయవాడ పుస్తక మహోత్సవం** ఆదివారంతో ముగియనుంది. ప్రధాన వేదిక గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై సాయంత్రం 6 గంటలకు ముగింపు సభ జరుగుతుంది. విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతిరాణా టాటా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో నగర మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. బుక్‌ఫెస్టివల్ కమిటీ సభ్యులు, ప్రచురణ కర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

కార్మిక పక్షపాతి వైవీ రావు

విశాలాంధ్ర-గుంటూరు : నిజాయితీ, చిత్తశుద్ధి గల కార్మికవర్గ పక్షపాతి కామ్రేడ్ వైవీ రావు అని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో అన్నారు. నమ్మిన సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం గల అరుదైన నాయకుడు వైవీ రావు అని కొనియాడారు. ఆయన మరణించారన్న వార్త అత్యంత విచారకరం, బాధాకరమన్నారు. కార్మిక, ఉద్యోగుల ఉద్యమం ప్రత్యేకించి ఏఐటీయూసీ ఒక నిబద్ధత గల నాయకుణ్ణి కోల్పోయిందని చెప్పారు. మూడు మాసాల క్రితం అలెప్పీలో జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభల సందర్భంగా, ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఇరువురం కలిశామని, ఆ సమావేశంలో ప్రధానోపన్యాసకుడుగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను బాగా ఎత్తిచూపారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికుల ప్రియతమ నేతగా, ప్రభుత్వోద్యోగుల ప్రతిష్టాత్మక జేఏసీకి ప్రధాన కార్యదర్శిగా అత్యంత అననుకూల పరిస్థితుల్లో సైతం నైపుణ్యంతో బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే స్నేహశీలి అని అన్నారు. ఆయన మరణం పట్ల హృదయ పూర్వక సంతాపాన్ని, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సెపక్‌తక్రా పోటీలకు

పటమట కేబీసీ జెడ్పీ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 19 నుంచి 21 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సెపెక్‌తక్రా పోటీలకు పటమట కెబిసి జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ప్రేమ్‌సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను, కోచ్ ఎస్.రమేష్, ఎస్ఏపిడి దుర్గారావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబినంధించారు. అండర్-14 బాలికల విభాగం : పి.హరిప్రియ, పి.హస్యభాను, వి.కావ్య, ఎస్‌కె.రేష్మ, ఆర్.అమృత. అండర్-14 బాలుర విభాగం : ఎమ్‌డి.జాకీర్, కె.కుషాల్, యు.జయసూర్య, ఎస్.కార్తీక్, టి.వంశీ. అండర్-17 బాలుర విభాగం : టి.యామినిదేవి, ఎస్‌కె.కతీజబేగం, కె.వెంకటలక్ష్మి, బి.ఉమాదేవి, పిబి.భాను. అండర్-17 బాలికల విబాగం : పి.సంతోష్‌కుమార్, ఎమ్‌డి.సమాద్, పిఎమ్‌డి.సమీర్‌ఖాన్, పి.శేషరెడ్డి, ఆర్.నర్‌బీర్.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ : సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్ స్టేషన్, 11కేవీ ఎస్ఆర్ఆర్ కాలేజీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తము ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విజయవాడ టౌన్ ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపు ప్రదేశాలు : చుట్టుగుంట రామాలయం రోడ్, గులామొహిద్దీన్ నగర్ కొండ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ బిల్డింగ్, మారుతీ నగర్ ఏలూరు రోడ్, మైహోమ్ అపార్ట్మెంట్స్, ఎస్ఆర్ఆర్ కాలేజీ ఏరియా, కాలేజీ వెనుక కాలువ గట్టు, ఓల్డ్ మలేరియా ఆఫీస్ రోడ్, హిందీ కాలేజీ రోడ్, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య వీధి, ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా ఏరియాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభ

విశాలాంధ్ర-గుంటూరు : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీన గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సాయంత్రం 6 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ మైలవరపు లలిత కుమారి అధ్యక్షతన జరిగే సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొంటారని, సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, పద్య కవి ఈటూరి వెంకటరెడ్డిలకు ఆత్మీయ సత్కారం జరుగుతుందని చెప్పారు. తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-తాడేపల్లి : నులకపేటలోని శివ కేశవ నగర్లోని చైతన్య తపోవన్ రజతోత్స వాల సందర్భంగా మహాశివరాత్రిని పురస్కరించుకుని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. బీపీ, షుగర్‌తో పాటు ఎముకల అరుగుదల పరీక్షలు నిర్వహిం చారు. 3046 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందు లు పంపిణీచేశారు.

బడుగు వర్గాలపై ప్రాంతీయ పార్టీల కపట ప్రేమ

విశాలాంధ్ర-పొన్నూరు : రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పట్ల కపటప్రేమను ఒలకబోస్తున్నాయని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా శ్రీనివాస్ దుయ్యబట్టారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో జోరుగా సాగిన యాత్రలో ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ కరపత్రాలను పంచిన జక్కా శ్రీనివాస్ కాంగ్రెస్‌కు పూర్వవైభవం పట్ల విశ్వాసం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు ఆర్ఎస్ఎస్ నియం తృత మతోన్మాద బీజేపీకు ప్రత్యేక మద్దతునిస్తూ బడుగు, బలహీన వర్గాల నైతికతను పణంగా పెడుతున్నాయని ఆయన విమర్శించారు. ఇందుకు ఏ ఒక్క పార్టీ అతీతంకాదని, కాంగ్రెస్‌తోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి ముడిపడి ఉందని, రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.

గాంధీజీ రాకతో స్వాతంత్రోద్యమంలో వేగం

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్) : గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు తెచ్చారని ఉద్యమకారుల్లో ఉన్న అంటరానితనం, అస్పృశ్యత భావనలను తొలగించి అందరూ సమానమనే భావం తీసుకురావటంతో ఉద్యమం ఊపందుకుదని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో 33వ విజయవడ పుస్తక మహోత్సవం గొల్లపూడి మారుతీరావు సాహిత్య వేదికపై శనివారం ప్రజాశక్తి అధ్వర్యంలో రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. 1.హిందుత్వ పునరాగమనం, 2. గాంధీజీ హంతకుడు గాడ్సే రెండు పుస్తకాలను ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రజాశక్తి ఎడిటర్ బి తులసి దాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ 1924లో ఆర్ఎస్ఎస్, కమ్యునిస్టు పుట్టుక సమాన కాలంలో జరిగింది. సమాన హక్కులు కోసం ఐక్యంగా ఉండాలని గాంధీ పిలుపిచ్చారు. అప్పుడే గాడ్సే గాంధీజీ హతమార్చాడని గుర్తు చేశారు. గాంధీ అంతా సమానమని విస్తృతంగా ప్రచారం చేశారని చెప్పారు. శాసన మండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 1857 తిరుగుబాటు తరువాత హిందువులు, ముస్లింలు సమైక్యత బ్రిటీష్ ప్రభుత్వం గుర్తించింది. దీని గుణ పాఠం తరువాత బ్రిటీష్ ప్రభుత్వం విభజించు పాలించు పద్ధతి ద్వారా సక్సెస్ అయిందన్నారు. 1925 తరువాత ఆర్ఎస్ఎస్ స్థాపన, వీడీ సావర్కర్ హిందుత్వ ప్రతిపాదన వలన మతత్వం పెరిగిందన్నారు. 1947 దేశ విభజన జరిగిందని చెప్పారు. నేడు 2014-23 వరకు దేశంలో హిందుత్వ దాడులు యూనివర్సిటీలోనూ ఇటీవల విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో విశాలాంధ్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ దాడులను మనం చూడటం జరిగిందన్నారు. మత సామరస్యం రక్షించుకోవాలని, పౌర సమాజం చైతన్యవంతులుగా చేసే బాధ్యత తీసుకోని, దేశాన్ని రక్షించు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ప్రజాశక్తి సీజీఎం వై అచ్యుతరావు, అనువాదకురాలు కె ఉషారాణి, ప్రజాశక్తి సంపాదకులు ఎస్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాహిత్యవేదికపై 'నూతన జాతీయ విద్యావిధానం - మాతృభాషలు' అనే అంశంపై సదస్సు జరిగింది. భాషాశాస్త్ర ఆచార్యులు ఆచార్య జోగా సింహ మాట్లాడుతూ నూతన జాతీయ విద్య విధానంపై మాట్లాడుతూ ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలనే నియమాన్ని ప్రతి ఒక్కరూ అమలు చేయాలని కోరారు. తెలుగు భాషోద్యమ సమాఖ్యకు, భారతీయ భాషల సంఘానికి జాతీయ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషలో నేర్చుకుంటే అన్ని రకాలుగా నైపుణ్యం పెరుగుతుదన్నారు. తెలుగు మర్చిపోయి ఇంగ్లీష్ మాత్రమే నేర్చుకుంటున్నారు. మన నైపుణ్యానికి ప్రమాదం రాబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పర భాష మన స్వేచ్ఛను హరిస్తుందన్నారు. అందుకే తెలుగును రక్షించుకుందమని పిలుపునిచ్చారు. అమ్మనుడి మాస పత్రిక ఎడిటర్ సామర్ల రమేష్ బాబు మాట్లాడుతూ మాతృ భాష విషయంలో మనం చాలా ప్రమాదంలో ఉన్నామన్నారు. మాతృ భాష రాకుండా ఇతర భాషలు రావనే అంశంపై అందరినీ చైతన్య వంతులను చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం బాధాకరం



విశాలాంధ్ర-గుడివాడ : అనపర్తిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు సతవిధాల ప్రయత్నించడం బాధాకరమని టీడీపీ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీలు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంతమంది పోలీసులు వైకాపా కార్యకర్తలు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో త్వరలో వచ్చే పార్టీ టిడిపినే అని గుర్తుపెట్టుకోవలన్నారు. పోలీసులు చంద్రబాబు పర్యటన అడ్డుకున్నప్పటికి పార్టీ కార్యకర్తలు అండగా నిలవడం వల్ల చంద్రబాబు పర్యటన విజయవంతం అయిందన్నారు. అనపర్తిలో చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు కొంత మంది పోలీసులు ఎన్ని కుట్రలతో ప్రయత్నించినప్పటికీ తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులను అడ్డుకొని చంద్రబాబు పర్యటన విజయవంతం చేశారని తెలుగురైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ళ సుబ్రహ్మణేశ్వరరావు ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ తెలుగుదేశం పార్టీపై ప్రజాదరణ పెరగడంతో అది చూసి ఓర్వలేని వైకాపా ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.